## ప్రజల మాట ప్రగతి బాట

## నర్సాపూర్/మెదక్ నియోజకవర్గాలు




నాడు: వాగులో నుంచి కాలినడకన గ్రామానికి వస్తున్న గిరిజన తండా వాసులు




నేడు: సొంత నిధులతో సర్పంచ్ జ్యోతి పైపుల ద్వారా నిర్మించిన రోడ్డు మార్గం

# నాడు సౌలత్‌లకు సతమతం.. నేడు సత్వరమే పరిష్కారం

రామాయంపేట, అక్టోబర్ 28: నాడు సమైక్య పాలనలో కనీస వసతులు లేక ప్రజలు అల్లాడిపోయారు. ఊర్లలో ఉన్న చెరువులకు అలుగులు, వంతెనలు, వాగులు తెగినాయంటే అవి మళ్లీ మంజూరు చేయడం అరుదుగా ఉండేది. కానీ నేడు తెలంగాణ ప్రభుత్వ పాలనలో ఎక్కడ సమస్య వచ్చిన సరే ప్రజల సౌకర్యార్థం వెంటనే ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిధులు సమకూర్చి సత్వరమే పనులు పూర్తి చేయిస్తున్నారు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్-సదాశివనగర్ గిరిజన తండాలకు మధ్యలో ఉన్న వాగు వర్షాలు పడడంతో ఎప్పుడో దశాబ్దం క్రితం తెగిపోయి రెండు గ్రామాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడేవారు. కానీ, నేటి తెలంగాణ పాలనలో సత్వరమే స్థానిక సర్పంచులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. గ్రామ సర్పంచ్ పంబాల జ్యోతి సొంతంగా నిధుల సేకరించి పైపుల ద్వారా రోడ్డు వేయించి ఇరుగ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు మరమ్మతు పనులను వెనువెంటనే పైపుల ద్వారా మట్టి పోయించి పూర్తి చేయించారు. ఈ రోడ్డు, వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.3 కోట్ల 45 లక్షల నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ పంబాల జ్యోతి శ్రీనివాస్ తెలిపారు.

## నేటి నర్సాపూర్ సభను సక్సెస్ చేయాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్

శివ్వంపేట, అక్టోబర్ 28: నర్సాపూర్ పట్టణంలో నేడు (ఆదివారం) నిర్వహించే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమణాగౌడ్ పేర్కొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని కంజర్ల శంకర్‌యాదవ్ గార్డెన్‌లో నిర్వహించే నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి హాజరు కానున్నారని, శివ్వంపేట మండలం నుంచి అధిక సంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామకమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరు హాజరుకావాలని కోరారు.

## 3న నిజాంపేట మండల సర్వసభ్య సమావేశం

నిజాంపేట, అక్టోబర్ 28: నిజాంపేటలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నవంబర్ 3న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో జగదీశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

## బగలాముఖి శక్తిపీఠంలో పౌర్ణమి పూజలు

శివ్వంపేట, అక్టోబర్ 28: మండల కేంద్రమైన శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యానమందిరంలో వేదపండితులతో కలసి హోమం నిర్వహించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్-రమాదేవి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని శక్తిపీఠానికి వచ్చిన భక్తులందరికీ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. ప్రతి పౌర్ణమి పూజలకు భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమంలో శక్తిపీఠం స్థలదాత పబ్బ రమేశ్‌గుప్తా దంపతులు, సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, వేద పండితులు శాస్త్రుల వివేక్‌శర్మ, చరణ్‌శర్మ, బీఆర్ఎస్ నాయకులు ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, వంజరి కొండల్, బాసంపల్లి పోచాగౌడ్, సూర్యంకుమార్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.1,74,130 నగదు సీజ్

నర్సాపూర్, అక్టోబర్ 28: నర్సాపూర్ పట్టణంలోని మల్లన్న దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం రూ.1,74,130 నగదును సీజ్ చేశామని ఎస్సై శివకుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపెల్లి ప్రవీణ్ తన బైక్‌పై ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.68,820 నగదును పట్టుకొని సీజ్ చేశామని, కుంచలపల్లి విల్సన్ తన కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1,05,310 నగదును కూడా సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌లో హరీశ్‌రావు సభ

చిలిపిచెడ్,అక్టోబర్ 28: నర్సాపూర్ పట్టణంలో నేడు (ఆదివారం) నిర్వహించే మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని చిలిపిచెడ్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ పట్టణంలో ఆదివారం సభ నిర్వహిస్తున్నామని మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ ఆర్థికసాయం

శివ్వంపేట, అక్టోబర్ 28: శివ్వంపేట మండలంలోని గంగాయపల్లికి చెందిన బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆర్థికసాయం అందజేశారు.గంగాయిపల్లిలో ఇటీవల మృతిచెందిన బొట్టు లక్ష్మి కుటుంబానికి, వెన్నుముక గాయంతో బాధపడుతున్న తలారి శ్రీనివాస్‌లను శనివారం పరామర్శించి జడ్పీటీసీ వారికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు పవన్‌గుప్తా, గంగాయపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

రామాయంపేట, అక్టోబర్ 28: రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. శనివారం గ్రామంలోని మహర్షి వాల్మీకి చిత్రపటానికి గ్రామానికి చెందిన వాల్మీకి బోయ కులసంఘం ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్లం, స్వామి, నర్సింహులు, వెంకటయ్య, నాగరాజు, పరశరాములు, రవి తదితరులు ఉన్నారు.




రామాయంపేట: కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న హరిజన కాలనీవాసులు

# మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

● మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ● రామాయంపేటలో 20 మంది బీఆర్ఎస్‌లో చేరిక

రామాయంపేట, అక్టోబర్ 28: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయనున్నారని రామాయంపేట మండల పార్టీ అధ్యక్షుడు బండారు మహేందర్‌రెడ్డి, పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ స్రవంతి సిద్ధిరాంరెడ్డి అధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు ఆఫీస్‌లో హరిజన కాలనీకి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఒకటవ వార్డు కౌన్సిలర్ బొర్ర అనిల్ అధ్వర్యంలో పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు గులాబీ కండువా మెడలో వేసి వారిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాలోనే భారీ మెజారిటీ సాధించేలా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, యువజన నాయకుడు కర్రె రమేశ్, సిద్దరాములు, గావు పరమేశ్, కొండల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



పట్టణంలో బైక్‌ర్యాలీ తీస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

## అమర పోలీసుల సేవలు చిరస్మరణీయం

రామాయంపేట, అక్టోబర్ 28: రామాయంపేట పట్టణంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్, అగ్నిమాపక శకటం సిబ్బందితో పాటు పట్టణ యువకులు పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామాయంపేట సీఐ లక్ష్మీబాబు మాట్లాడుతూ అమర పోలీసుల సేవలు చిరస్మరణీయం, వారి త్యాగఫలితమే నేడు ఫ్రెండ్లీ పోలీస్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నామన్నారు. పతి పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులు కూడా ఉంటారని ధైర్యంగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై.రంజిత్, అగ్నిమాపక శకట సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ తీశారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

● అదనపు కలెక్టర్ రమేశ్ ● 'సీ విజిల్ - స్వీప్ ఆక్టివిటీస్'పై ప్రజలకు అవగాహన




కొల్చారం: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

కొల్చారం, అక్టోబర్ 28: ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్, అడిషనల్ ఎస్పీ మహేందర్ సూచించారు. మండల కేంద్రమైన కొల్చారంలో 'సీ విజిల్-స్వీప్ ఆక్టివిటీస్'పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి యువతీయువకులు ఈనెలాఖరు వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 80 ఏండ్లు పైబడినవారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఎన్నికల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే యువత 'సీ విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ కేంద్ర బలగాలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యతపై నిర్వహించిన 'కళాజాత' పలువురిని ఆకట్టుకుంది. అలాగే ఓటుహక్కు వినియోగంపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మజీ, మండల ప్రత్యేకాధికారి నాగరాజు, తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎస్సై మహ్మద్ గౌస్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కొల్చారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్, అడిషనల్ ఎస్పీ మహేందర్

## దళారులను నమ్మి మోసపోవద్దు

కొల్చారం, అక్టోబర్ 28: ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. మండల కేంద్రమైన కొల్చారంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం అడిషనల్ ఎస్పీ మహేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత, లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ఉన్నందున ధాన్యం తూకం ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మనోహర్, సీఈవో కృష్ణ, సిబ్బంది నర్సింహులు, డైరెక్టర్లు శ్రీను, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.